ఆచరణీయం అయ్యప్ప దీక్ష

నగరంలోని అయ్యప్ప ఆలయంలోపూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

- పెద్ద సంఖ్యలో మాలధారణ స్వీకరిస్తున్న భక్తులు
- జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంతో పాటు పలు చోట్ల అన్నదానం.. అల్పాహారం ఏర్పాటు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 8: జిల్లాలో అయ్యప్ప భక్తుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతున్నది. రోజులో ఒకసారి భోజనం (భిక్ష), అల్పాహారం, రెండుసార్లు చన్నీటి స్నానం, నేలపై నిద్రించడం వంటి కఠిన నియమాలు పాటించడం దీక్ష ప్రత్యేకత. దీంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతున్నది. అయ్యప్ప దీక్ష ప్రాధాన్యం, పాటించాల్సిన నియమాలు, పూజా విధానంపై ప్రత్యేక కథనం....

మాలధారణకు మూడు రోజుల ముందే..

అయ్యప్ప మాల ధరించే వారు మూడు రోజుల ముందు నుంచే పవిత్రంగా ఉండాలి. దురలవాట్లకు స్వస్తి పలుకాలి. మద్యం, మాంసాహారం తీసుకోవద్దు. గోర్లు, తలవెంట్రుకలు ముందే కత్తిరించుకోవాలి. దీక్ష స్వీకరణకు తల్లిదండ్రులు, భార్య అనుమతి తీసుకోవాలి.

దీక్ష స్వీకరించే రోజు..

మాల ధరించే రోజు భక్తులు ఉతికిన బట్టలు ధరించి పాదరక్షలు లేకుండా సమీపంలోని అయ్యప్ప గుడికి వెళ్లాలి. నల్ల లుంగీ, కండువా, చొక్కా, తులసి మాలలను వెంట తీసుకెళ్లాలి. గురుస్వామితో మాలధరించే ముందుగానే నుదుటిపై అలంకరణ చేసుకోవాలి. బ్రహ్మదేవుడిని చందనంగా... శివుడిని విభూది రూపంలో, విష్ణుమూర్తిని కుంకుమరూపంలో నుదుటిపై దిద్దుకోవాలి. ఆరుపర్యాయాలు శబరియాత్రకు వెళ్లి మకరజ్యోతిని దర్శించుకున్న గురువుతో మాల స్వీకరించాలి. మాల ధరించాక మొదటిసారి గురుస్వామికి పాదపూజ చేయాలి. సమీపంలోని గణపతి, సుబ్రమణ్యస్వామి, అమ్మవారి ఆలయాలను దర్శించుకోవాలి. మాల విరమణ పూర్తయ్యే వరకు పాదరక్షలు ధరించరాదు.

దీక్ష స్వీకరించాక..

మాల ధరించిన స్వాములు మండల దీక్ష పూర్తి చేసుకునేందుకు విడిది సమకూర్చుకోవాలి. ఇంట్లో స్థలం ఉంటే అక్కడే పీఠం పెట్టుకోవచ్చు. లేదంటే స్వాములంతా సామూహికంగా సన్నిధానం ఏర్పాటు చేసుకోవచ్చు. సన్నిధానంలో ప్రత్యేక పీఠం ఏర్పాటు చేసి దానిపై నూతన వస్త్రం వేసి బియ్యం పోసి గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వాముల చిత్రపటాలు ప్రతిష్ఠించాలి. మండల దీక్ష కోసం సంకల్పం తీసుకుని కలశస్థాపన చేయాలి. ఒకసారి కలశస్థాపన జరిగిన తర్వాత దీక్ష ముగిసే వరకు కదిలించేందుకు వీలుండదు. పీఠంపై దేవతామూర్తుల చిత్రపటాలు ప్రతిష్ఠించాక అటూ ఇటూ కదపరాదు. దేవతామూర్తుల చిత్రపటాలకు శిరస్సు నుంచి పాదాల వరకు అలంకరణ చేయాలి. దీపారాధన చేసి స్వామి వారి పూజ ప్రారంభించాలి. ముందుగా గణపతిపూజ, సుబ్రహ్మణ్యస్వామిని కొలిచి అయ్యప్ప పూజను కొనసాగించాలి. పూజ ముగిశాక హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు తీసుకోవాలి. మాల ధరించిన స్వాములు సాష్టాంగ నమస్కారం చేసుకోవాలి.

చన్నీటి స్నానం..

మాల ధరించిన స్వాములంతా చన్నీటి స్నానం ఆచరించాలి. వేకువజామున బ్రహ్మ ముహూర్తంలో స్నానం చేసి సూర్యోదయం లోపే పూజ ముగించాలి. సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత మళ్లీ చన్నీటి స్నానం చేసి సంధ్యా పూజకు కూర్చోవాలి. దీక్షాకాలంలో అయ్యప్ప స్వాములు క్రమశిక్షణతో మెలగాలి. ఎదుటివారితో మర్యాదగా మాట్లాడాలి. తోటి స్వాములతో సఖ్యతగా ఉంటూ గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి. పాదపూజ చేసుకోవాలి. ఇలాంటి నియమాలతో మనిషిలో క్రమశిక్షణ పెరుగుతుంది. కోటీశ్వరుడైనా సరే అయ్యప్పదీక్షలో నేలపై కూర్చుని తోటిస్వాములతో కలిసి భోజనం చేసి అందరితో కలిసి పూజ చేయాలి. పాదయాత్రగా వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకోవాలి. అందుకే అయ్యప్పదీక్షతో భక్తి భావం పెరిగి పదికాలాల పాటు ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

ఆరోగ్యానికి ఎంతో మేలు..

అయ్యప్పదీక్ష ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుందని వైద్యులు చెబుతున్నారు. చన్నీటి స్నానంతో రోగాలు దూరమవుతాయని, చెప్పులు లేకుండా నడవడంతో రక్తప్రసరణ మెరుగవుతుంది. ఏకభుక్తంతో శరీర ఆకృతిమారిపోయి సాత్విక ఆహారంతో రోగాలు దరిచేరవు. ఈ దీక్షాకాలంలో చేసే పూజల్లో మామిడితోరణాలు, పసుపు, అరటికొమ్మలతో పందిళ్లు వేయడం ద్వారా మంచి గాలిని పీల్చుకునే అవకాశం ఉంటుంది. నేలపై నిద్రించడంతో వెన్ను నొప్పి లాంటివి దూరమవుతాయి. నదీస్నానంతో ఆయుష్షు పెరుగుతుంది. పంబానదిలో ఎన్నో వన మూలికలతో కూడిన ప్రవాహంలో స్నానం చేయడం ద్వారా రుగ్మతలు తగ్గుతాయి. నుదుటిపై విభూది ధరించడం ద్వారా నుదిటి మధ్యభాగంలో అతి సున్నితమైన నరాలకు చల్లదనాన్ని ఇస్తుంది. గంధం సువాసనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. విభూది యాంటీబ్యాక్టీరియాగా పనిచేసి రోగ నిరోధకశక్తిని పెంచుతుంది.

ఇరుముడి..

దీక్షా కాలం ముగిసిన స్వాములు ఆరు పర్యాయాలు శబరియాత్రకు వెళ్లివచ్చిన గురుస్వాములతో ఇరుముడి కట్టించుకోవాలి. నల్లని సంచితో ఇరుముడి ఏర్పాటు చేస్తారు. అందులో మొదటి ముడిని 'ఇరుముడి' అంటారు. ఈ సంచిలో పూజాద్రవ్యాలు ఉంచుతారు. ఇదే ఇరుముడిలో దేహంగా భావించే 'టెంకాయ'ను శుభ్రం చేసి అందులో ఆత్మగా భావించే 'ఆవునెయ్యి' పోస్తారు. ఇలా నెయ్యితో నిండిన ఆత్మను ఇరుముడిలో కట్టుకుంటారు. మరోపక్క ఉన్న ఇరుముడిలో తినేందుకు అవసరమైన పదార్థాలు పెట్టుకున్నారు. దీక్షాపరులు తమవెంట ఇరుముడితో పాటు ఒక జత దుస్తులు తీసుకెళ్లాలి.

అన్నదానం.. అల్పాహార దానం

జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ హరిహరక్షేత్రంలో అయ్యప్ప స్వాముల కోసం దాతల సహకారంతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదానం, అల్పాహార దానం ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఉదయం ఉచితంగా తేనీరు, బాదం పాలు అందజేస్తున్నారు. అలాగే, నగరంలోని పాత బజార్ శివాలయంలో, కృష్ణానగర్ అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

తేనీరు, అన్నదానం, అల్పాహారం అందిస్తున్నాం

ఇప్పటి వరకు హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో సుమారు 1800 మంది వరకు భక్తులు అయ్యప్ప మాల ధరించారు. ఆలయంలో భక్తుల కోసం ఉదయం తేనీరు, బాదం పాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అల్పాహారం జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, దాతల సహకారంతో ఉచితంగా ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమంలో భక్తులు కూడా భాగస్వాములై విజయవంతం చేయాలి.

- కే కాంతారెడ్డి, అయ్యప్ప ఆలయ ఈవో

మానసిక ప్రశాంతత లభిస్తుంది

ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో అయ్యప్ప దీక్ష ఆచరించి, ఆ స్వామి కృపకు పాత్రులు కావాలి. అయ్యప్ప మండల దీక్ష చేయాలనుకోవడం గొప్ప సంకల్పంతో కూడుకున్నది. దీక్ష స్వీకరించిన ప్రతి ఒక్కరూ 41 రోజులు నియమాలు పాటిస్తూ, ఏ రూపం కనిపించినా స్వామి రూపంలా భావించాలి. ఈ దీక్షతో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.

- మంగళంపల్లి రాజేశ్వర శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

నియమాలు పాటించాలి

దీక్ష స్వీకరించిన ప్రతి స్వామి నియమాలు తప్పకుండా పాటించాలి. ఏదైనా పనిని నిత్యజీవితంలో మండల కాలం పాటు చేస్తే మార్పు వస్తుంది. ఇందులో నుంచి అయ్యప్ప దీక్ష వచ్చింది. ఈ క్రమంలోనే అయ్యప్ప స్వామి మండల దీక్ష స్వీకరించిన వారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తున్నది. దీక్ష సమయంలో పాటించే నియమాలతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది. నియమ, నిబంధనలతో దీక్ష ఆచరిస్తే జీవితంలో ఎంతటి అడ్డంకులైనా ఎదురించవచ్చు.

- డింగరి చాణక్య, ఆలయ అర్చకుడు

ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

కొత్తపల్లి, డిసెంబర్ 8: అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీలకు నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థి ఎండీ అద్నాన్ అలీ ఎంపికయ్యారు. శాతవాహన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో ఎండీ అద్నాన్ అలీ పాల్గొని ప్రతిభ చూపాడు. కాగా, ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం ఎనెపోయా విశ్వవిద్యాలయం మైదానంలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీలకు ఎస్‌యూ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ డా. సీహెచ్ శ్రీనివాస్, ఏవో శ్రవణ్‌కుమార్, ఏసీవో సంపత్‌కుమార్, రామేశ్వర్‌రావు, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రితిష్ మెహతా, ఉపాధ్యాయులు

కొత్తపల్లి, డిసెంబర్ 8: నగరంలోని పద్మనగర్‌లో గల పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు శ్రీతేజ్, అభినవ్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కాగా, విద్యార్థులను శుక్రవారం విద్యాసంస్థల చైర్మన్ డా. ఈ ప్రసాదరావు, డైరెక్టర్లు అనుకర్‌రావు, రశ్మిత, ప్రసూనవినోద్‌రావు, వీయూఎం ప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్త రాము, పీఈటీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఉపాధి కల్పనాధికారి

ఉద్యోగ మేళాకు స్పందన

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 8: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాకు స్పందన వచ్చినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవేందర్ రావు పేర్కొన్నారు. ఏడు సంస్థలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనగా, 187 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు. 53 మందిని వివిధ ఉద్యోగాల కోసం ఎంపిక చేసినట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి, డిసెంబర్ 8: నగరంలోని బాలుర గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ ఎంపీసీఎస్‌లో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు పీజీతో పాటు సంబంధిత సబ్జెక్టులో డాక్టరేట్, నెట్, సెట్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఔత్సాహికులు ఈనెల 10వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 8: నగరంలోని 33/11కేవీ ఎస్సారార్ కాలేజీ, సప్తగిరికాలనీ, ఉజ్వల పార్కు, పద్మనగర్ సబ్ స్టేషన్లలో శనివారం మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

BEFORE THE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT : HYDERABAD
FA.IA.No. 669 OF 2023
IN
FA.No. 279 OF 2023
Against
CC.No. 207 OF 2016

(On the file of the District Consumer Disputes Redressal Commission, Karimnagar)

Between:
M/s. Shriram General Insurance Co. Ltd
Rep. by its Branch Manager
...Petitioner/Appellant/Opp. Party No.1
AND
Smt.Jampana Venkata Sirisha and others
...Respondents/Complainants/OP.No.2

To
Mohd. Sharfuddin S/o. Md. Sarwaruddin,
Age 43 Yrs, Occ. Business,
R/o. H.No. 6-2-198/3/D/1, Karimnagar.

This is to inform you that aggrieved by the Order of the DCC-Karimnagar in the above CC M/s. Shriram General Insurance Co. Ltd filed the above appeal. As the notices sent to you were returned with an endorsement "No such person in this address" the Hon'ble Telangana State Commission ordered publication to inform you that the above Appeal has been filed against you. Hence, it is ordered by the **Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission, Eruvaka Bhavan, Anand Nagar Colony Rd, Khairatabad, Hyderabad, TS-500004** to appear before the above mentioned Commission on 28-12-2023 by 10.30 a.m, otherwise the said appeal will be decided in your absence.

COUNSEL FOR THE PETITIONER/APPELLANT
Sd/- Smt. S.N.PADMINI
F.No.206, Swathi Rukmini Towers,
Kamalanagar, Rd.No.5, Dilsukhnagar,
Hyderabad-60, 9246213639

HYDERABAD,
Dt.09-12-2023.